
సాక్షి
పల్నాడు
సోమవారం । 15 । ఏప్రిల్ । 2024



అన్నమయ్య సంకీర్తన ఉచిత శిక్షణ

తెనాలిఅర్బన్: అన్నమయ్య సంకీర్తన ఉచిత శిక్షణ తరగతులను కొండపి వసుంధర ఆధ్వర్యంలో కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ఆదివారం ప్రారంభించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ నీటిమట్టం ఆదివారం 509.40 అడుగుల వద్ద ఉంది. కుడికాలువకు 5,496, ఎస్ఎల్‌బీసీకి 800 క్యూసెక్కులు విడుదలవుతోంది.

బండ్లమ్మకు ప్రత్యేక పూజలు



చందోలు(పిట్టలవానిపాలెం): చందోలులో ఉన్న బగళాముఖి బండ్లమ్మ దేవాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పసుపు, కుంకుమలతో అర్చనలు, అభిషేకాలు జరిపించారు.

ఆగ్రహ జ్వాలలు



సత్తెనపల్లిలో నిరసన ప్రదర్శనలో మంత్రి అంబటి రాంబాబు



వినుకొండలో కొవ్వొత్తుల ర్యాలీ, హాజరైన ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

- సీఎం వైఎస్ జగన్‌పై హత్యాయత్నానికి ఆ ముగ్గురిదే బాధ్యత
- దమ్ముంటే సార్వత్రిక ఎన్నికల్లో బ్యాలెట్ ద్వారా ఎదుర్కోండి
- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు
- వైఎస్ జగన్‌పై దాడిని ఖండిస్తూ జిల్లా వ్యాప్తంగా నిరసన ర్యాలీలు

సత్తెనపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై విజయవాడలో హత్యాయత్నానికి చంద్రబాబు నాయుడు, లోకేష్, పవన్‌కళ్యాణ్‌లదే బాధ్యత అని, రానున్న ఎన్నికల్లో టీడీపీని కచ్చితంగా భూస్థాపితం చేస్తామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు హెచ్చరించారు. సీఎం వైఎస్ జగన్‌పై హత్యాయత్నాన్ని నిరసిస్తూ ఏఎంసీ చైర్మన్ పెండెం బాబూరావు, పల్నాడు జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు చిలకా జైపాల్ ఆధ్వర్యంలో ఆదివారం పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ ఓటమి భయంతో టీడీపీ కుట్రలకు పాల్పడుతోందని విమర్శించారు. దమ్ముంటే ప్రజాస్వామ్యబద్ధంగా బ్యాలెట్ ద్వారా వైఎస్ జగన్‌ను ఎదుర్కోవాలని కోరారు. చంద్రబాబు నాయుడు హింసను ప్రోత్సహిస్తే తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. అధికారంలోకి రాలేనని ఫ్రస్టేషన్‌లోనే దాడి చేయించారని ఆరోపించారు. ప్రజాస్వామ్య చరిత్రలో ఇది దుర్దినంగా పేర్కొన్నారు. మేమంతా సిద్ధం బస్సు యాత్రకు ప్రజలు నీరాజనం పడుతున్నారని చెప్పారు. ఇది చూసి ఓర్వలేక కూటమి ఇలాంటి కుట్రలకు పాల్పడుతోందని దుయ్యబట్టారు. తొలుత వైఎస్సార్ సీపీ కార్యాలయం నుంచి తాలూకా సెంటర్‌కు వరకు వెళ్లి అక్కడ నుంచి గడియార స్తంభం మీదగా తిరిగి ర్యాలీ కార్యాలయానికి చేరింది. ర్యాలీలో జై జగన్.. జై జగన్ అంటూ నినదించారు. డౌన్‌డౌన్ చంద్రబాబు అంటూ దిక్కులు పిక్కటిల్లేలా నినాదాలు చేశారు. ర్యాలీలో గుంటూరు మిర్చి యార్డు చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు డాక్టర్ గీతా హసంతి, జిల్లా గ్రంథాలయాల సంస్థ మాజీ చైర్మన్ చిట్టా విజయభాస్కర్ రెడ్డి, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చలంచర్ల సాంబశివరావు, వైఎస్సార్ సీపీ పట్టణ పార్టీ అధ్యక్షులు షేక్ మౌలాలి, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు అచ్యుత శివ ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రజాదరణ ఓర్వలేక సీఎం వైఎస్ జగన్‌పై దాడి

నరసరావుపేట: ప్రజల్లో వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబునాయుడు దాడి చేయించారని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన మేమంతా సిద్ధం బస్సు యాత్రలో భాగంగా విజయవాడలో రోడ్‌షో చేస్తుండగా ఆయనపై దాడికి నిరసనగా ఆదివారం పట్టణ నడిబొడ్డున గడియారం స్తంభం సెంటర్‌లో పార్టీ శ్రేణులతో కలసి ధర్నా చేశారు. పార్టీ జెండాలు చేతబూని చంద్రబాబుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇటువంటి భౌతిక దాడులకు ప్రజాస్వామ్యంలో చోటులేదని చెప్పారు. సీఎం వైఎస్ జగన్‌ను ఎదుర్కొలేక జనసేన, బీజేపీతో కలసి వచ్చినా ఫలితంలేకపోవటంతో దాడులకు తెగబడ్డారన్నారు. గతంలో ఇదే విజయవాడలో తనకు రక్షణ కల్పించాలని కోరుతూ ఎమ్మెల్యేగా ఉన్న వంగవీటి రంగాను హత్యచేయించాడని ఆరోపించారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాపై తిరుపతిలో రాళ్లతో దాడి చేయించిన ఘటనను గుర్తుచేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎవరూ ఆపలేరని, దాడి జరిగినా రోడ్‌షో కొనసాగించారని, ప్రభుత్వాస్పత్రిలో చికిత్స చేయించుకున్నారని చెప్పారు. ఇటువంటి కుట్రలకు పాల్పడుతున్న చంద్రబాబును ఓడించాలని ప్రజలకు పిలుపు ఇచ్చారు. నరసరావుపేటలో వైఎస్సార్ సీపీ బలంగా ఉందని, తనతో పాటు పార్లమెంటు అభ్యర్థి డాక్టర్ పి.అనిల్‌కుమార్‌యాదవ్‌ను గెలిపించాలని కోరారు.

సీఎంపై హత్యాయత్నం పిరికిపందల చర్య

ఎమ్మెల్యే నంబూరు శంకరరావు



అమరావతిలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

పెదకూరపాడు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై హత్యాయత్నం పిరికిపందల చర్య అని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. పెదకూరపాడు, అమరావతి, క్రోసూరులో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో నిరసన ర్యాలీలు నిర్వహించారు. అనంతరం వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌కి ప్రజల్లో వస్తున్న జనాదరణను చూసి తట్టుకోలేక దుశ్చర్యకు పాల్పడ్డారని ఆరోపించారు. సమయం చూసి విద్యుత్ లేని సమయంలో పక్కా ప్రణాళికతో ప్రతిపక్షాలు దాడి చేయించాయని పేర్కొన్నారు. కనీసం సానుభూతి చూపించకుండా డ్రామాలు అంటూ టీడీపీ నేతలు మాట్లాడతున్న తీరు ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. దాడికి పాల్పడిన వారిని గుర్తించి శిక్షపడేలా చర్యలు తీసుకోవాలన్నారు.

వైఎస్ జగన్‌పై దాడి హేయం

- కుట్రలు మానుకో చంద్రబాబు..
- జగన్‌కు అండగా నిలబడదాం
- ప్రభుత్వ విప్ పీఆర్కే, పీవీఆర్



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ పీఆర్కే, పీవీఆర్, చలమారెడ్డి

మాచర్ల: రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల సందర్భంగా చేపట్టిన మేమంతా సిద్ధం బస్సు యాత్ర సభలకు లక్షలాది మంది ప్రజలు తరలివస్తుండటంతో సహించలేక కుట్రలు, కుతంత్రాలకు మారుపేరైన మాజీ సీఎం చంద్రబాబునాయుడు కుట్ర పన్ని సీఎం వైఎస్ జగన్‌పై హత్యాయత్నం చేయించడం అత్యంత దారుణమని పల్నాడు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు.

పట్టణంలోని ప్రభుత్వ విప్ క్యాంపు కార్యాలయంలో పీఆర్కే, వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన ఉపాధ్యక్షుడు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి, సీనియర్ నాయకులు కొమ్మారెడ్డి చలమారెడ్డితో కలసి ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వైఎస్ జగన్‌పై విజయవాడలో జరిగిన దాడిని తీవ్రంగా ఖండించారు. 99 శాతం హామీలు నెరవేర్చి వైఎస్ జగన్ ప్రజల్లోకి దూసుకెళ్తున్నారని చెప్పారు. ఇదంతా గమనించాక, ఎన్నికల్లో తమకు ఓటమి తప్పదని ముందుగా గ్రహించిన చంద్రబాబు ఒక కుట్ర ప్రకారం ఇటువంటి దుష్ట పన్నాగం చేశారని ఎద్దేవా చేశారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ తాడి వెంకటేశ్వరరెడ్డి, మున్సిపల్ చైర్మన్ మాచర్ల చిన ఏసోబు, మున్సిపల్ మాజీ చైర్మన్‌లు బత్తుల ఏడుకొండలు, బోయ రఘురామిరెడ్డి, తురక కిషోర్, అబ్దుల్ జలీల్, పట్టణ అధ్యక్షుడు పోలా శ్రీనివాసరావు, మహిళా అధ్యక్షురాలు నాగమణి, జెడ్పీటీసీ సభ్యుడు ఎం.పెద మల్లుస్వామి పాల్గొన్నారు.



దాచేపల్లిలో ధర్నా చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



నరసరావుపేటలో ధర్నా చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి, పార్టీ శ్రేణులు



ముప్పాళ్లలో చంద్రబాబు దిష్టిబొమ్మ దహనం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

న్యూస్‌రీల్

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గొప్ప దార్శనికుడు

కలెక్టరేట్‌లో నివాళులర్పించిన జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్



నరసరావుపేట: భారత రాజ్యాంగ నిర్మాణంలో భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పాత్ర మరువరానిదని జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో ఆదివారం సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. గొప్ప దేశభక్తి, మానవతా విలువలు కలిగిన డాక్టర్ అంబేడ్కర్ గొప్ప దార్శనికుడు అని పేర్కొన్నారు. ఆశయాలు ఆదర్శనీయం అన్నారు. ఆయన స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ విద్యావంతులై అభివృద్ధి చెందాలన్నారు. అంబేడ్కర్ రచించిన రాజ్యాంగంలో సామాజిక న్యాయాన్ని పొందుపరిచారని, ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. వారి స్ఫూర్తితో విద్యార్థులంతా గొప్ప చదువులు చదవాలన్నారు. ఎన్నికల్లో 18 ఏళ్ల దాటి ఓటు హక్కు కలిగిన వారు ఓటు వినియోగించుకోవాలన్నారు. అన్ని వర్గాల అభివృద్ధిని కాంక్షిస్తూ అందరికీ ఆదర్శప్రాయంగా నిలిచారన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.వి నాయకం, సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆధునిక చిత్రకళలో మార్పులను స్వాగతించాలి



విజయవాడకల్చరల్: ఆధునిక చిత్రకళలో వస్తున్న మార్పులను స్వాగతించాలని ప్రపంచ తెలుగు చిత్రకారుల సమాఖ్య అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎస్ఎం పిరాన్ అన్నారు. చిత్రకారుల సమాఖ్య ఆధ్వర్యాన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా స్వరాజ్య మైదానంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద చిత్ర కళాంజలి పేరుతో చిత్ర కళా ప్రదర్శన, చిత్రకారులకు సన్మానం, విగ్రహ రూప శిల్పి శివప్రసాద్ ఆత్మీయ సత్కార కార్యక్రమం నిర్వహించారు. చిత్రకారుడు పిరాన్ చిత్ర కళ ఆధునికత అంశంగా ప్రసంగించారు. సంస్థ ప్రధాన కార్యదర్శి కె.బాలయోగి మాట్లాడుతూ భారతీయ చిత్రకళ ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తోందని తెలిపారు. జాయింట్ సెక్రటరీ మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రపంచ తెలుగు చిత్రకారుల సమాఖ్య ద్వారా బాల బాలికలకు శిక్షణనిస్తున్నట్లు తెలిపారు. చిత్ర కళావర్క్‌షాప్‌లో 30 మంది చిత్రకారులు పాల్గొన్నారు.

వైభవం.. కల్యాణోత్సవం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గా మల్లేశ్వర స్వామి వారి ఆలయ ప్రాంగణంలో షష్ఠిని పురస్కరించుకుని వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి వారి కల్యాణోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై ఉత్సవ మూర్తులకు ఆలయ వైదిక కమిటీ సభ్యుడు యజ్ఞనారాయణ శర్మ, అర్చకులు కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. ఆలయ ఈవో కేఎస్ రామరావు, పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కల్యాణోత్సవం అనంతరం స్వామి వారికి తలంబ్రాలను సమర్పించగా, ఆ తర్వాత తలంబ్రాలను భక్తులకు పంపిణీ చేశారు. ఆ తర్వాత ఉత్సవ మూర్తులకు నిర్వహించిన పల్లకీ సేవలో పాల్గొనేందుకు భక్తులు పోటీ పడ్డారు. సేవలో పాల్గొన్న ఉభయదాతలకు ప్రత్యేక క్యూలైన్ మార్గం ద్వారా అమ్మవారి దర్శనానికి అనుమతించారు.

దుర్గమ్మ సేవలో దేవదాయ శాఖ కమిషనర్

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దేవదాయ శాఖ కమిషనర్ ఎస్. సత్యనారాయణ ఆదివారం దుర్గమ్మను దర్శించుకున్నారు. వేద పండితులు ఆశీర్వచనం అందజేయగా, ఆలయ ఈవో రామరావు అమ్మవారి ప్రసాదాలను బహూకరించారు. ఆలయ ప్రాంగణంలోని లక్ష్మీ గణపతి విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రంలో కమిషనర్ సత్యనారాయణ భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు.

ఏపీ ఫర్టిలైజర్స్, ఫెస్టిసైడ్స్ అండ్ సీడ్ డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడుగా నాగిరెడ్డి

కొరిటిపాడు(గుంటూరు): ఆంధ్రప్రదేశ్ ఫర్టిలైజర్స్, ఫెస్టిసైడ్స్ అండ్ సీడ్ డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా వజ్రాల వెంకట నాగిరెడ్డి రెండవసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గుంటూరులోని అసోసియేషన్ కార్యాలయంలో అసోసియేషన్ సర్వసభ్య సమావేశాన్ని ఆదివారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నూతన రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడుగా వి.వి.నాగిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఎన్.అశోక్‌రెడ్డి(కర్నూలు జిల్లా), కోశాధికారిగా కె.విజయ్‌కుమార్(ఎన్టీఆర్ జిల్లా), నలుగురు ఉపాధ్యక్షులు, నలుగురు కార్యదర్శులతో పాటు 52 మంది కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. వీరందరూ ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు నాగిరెడ్డి మాట్లాడుతూ ఫర్టిలైజర్స్, ఫెస్టిసైడ్స్, సీడ్ డీలర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. రైతులకు ఇబ్బందులు లేకుండా, వారు అడిగిన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు సరఫరా చేయాలని ఆయన వ్యాపారులకు సూచించారు. సేవాభావంతో అందరూ పనిచేస్తే తగిన గుర్తింపు ఉంటుందని చెప్పారు. సమావేశంలో పలు తీర్మానాలు చేసి, ఏకగ్రీవంగా ఆమోదించారు.

అంబేడ్కర్ మార్గంలో వైఎస్ జగన్ సుపరిపాలన

- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు
- ఘనంగా అంబేడ్కర్ జయంతి వేడుకలు



సత్తెనపల్లిలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి భారతీయులందరికీ పండుగ రోజు అని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు పేర్కొన్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెండెం బాబూరావు, పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు చిలుకా జైపాల్, పార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్ మౌలాలి ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి, తాలూకా సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. మంత్రి అంబటి రాంబాబు సామాజిక సమానత్వ సాధకుడు, దేశ దార్శనికుడు, మహనీయుడు డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ అన్నారు. అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బడుగు, బలహీన వర్గాలకు ప్రాముఖ్యతనిస్తూ సుపరిపాలన అందిస్తున్నారని కొనియాడారు. దళిత, బహుజన, బడుగు, బలహీన వర్గాల ఆత్మ గౌరవాన్ని నలుదిక్కులా చాటిచెప్పేలా ప్రపంచంలోనే అతిపెద్ద అంబేడ్కర్ విగ్రహాన్ని విజయవాడ నడిబొడ్డున ప్రతిష్టించారని గుర్తుచేశారు. విద్య ద్వారానే రాజ్యాధికారం సాధ్యమని చాటిచెప్పిన అంబేడ్కర్ సిద్ధాంత సాధనలో భాగంగా విద్యారంగాన్ని సంస్కరణల బాట పట్టించిన ఘనత వైఎస్ జగన్‌దేనన్నారు. నియోజకవర్గంలోనూ దళిత, బడుగు, బలహీన, వర్గాలకు రాజకీయ ప్రాధాన్యం ఇచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో గుంటూరు మిర్చి యార్డు చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చిట్టా విజయభాస్కర్ రెడ్డి, పార్టీ నియోజకవర్గ నాయకుడు పక్కాల సూరిబాబు, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు, రాజుపాలెం ఎంపీపీ తేలుకుట్ల రాజేశ్వరి, నాయకులు అచ్యుత శివప్రసాద్, కోడిరెక్క దేవదాస్, గుజర్లపూడి సతీష్, చిలుకా నాగేశ్వరరావు, జూపల్లి పాల్, పెద్దింటి నాగేశ్వరరావు, కాశిమాల ఓబయ్య, కాటుమాల డేవిడ్, షేక్ నాగుల్‌బాషా పాల్గొన్నారు.

కనులపండువగా పుష్పార్చన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై వసంత నవరాత్రోత్సవాల్లో ఆరో రోజైన ఆదివారం దుర్గగుడిలో అమ్మవారికి కాగడా మల్లెలు, జాజులతో అర్చన చేశారు. తొలుత ఆలయ ఈఓ కె.ఎస్.రామరావు దంపతులు, ఏఈఓ ఎస్. రమేష్‌బాబు, స్థానాచార్య శివప్రసాద్ శర్మ, వైదిక కమిటీ సభ్యులు రంగావజ్ఝల శ్రీనివాసశాస్త్రి, మురళి అమ్మవారికి అర్చన చేయించే పుష్పాలతో అంతరాలయంలోని మూలవిరాట్‌ను దర్శించుకున్నారు. అనంతరం మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా పుష్పార్చన వేదిక వద్దకు చేరుకున్నారు. ఆలయ అర్చకులు వేద మంత్రోచ్చారణ చేస్తుండగా, అర్చకులు పుష్పాలతో అమ్మవారికి అర్చన నిర్వహించారు. అనంతరం అమ్మవారికి పంచహారతుల సేవ జరిగింది. అర్చన చేసిన పుష్పాలను భక్తులకు పంపిణీ చేశారు. భక్తులతో లక్ష్మీ గణపతి ప్రాంగణం సందడిగా మారింది. పుష్పార్చనను వీక్షించేందుకు విచ్చేసిన భక్తులకు ఈవో రామరావు సౌభాగ్య ఆధ్యాత్మిక పుస్తకాలను పంపిణీ చేశారు.

టీడీపీ అంతానికి సిద్ధం కావాలి



హైదరాబాదులో గజమాలతో డాక్టర్ అనీల్, డాక్టర్ గోపిరెడ్డిలను సన్మానిస్తున్న నగర వాసులు

- హైదరాబాద్‌లో నరసరావుపేట వాసులతో ఆత్మీయ సమావేశం
- హాజరైన పార్లమెంటు, అసెంబ్లీ అభ్యర్థులు డాక్టర్ అనీల్, డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: రాష్ట్రంలో నలభై ఏళ్ల తెలుగుదేశం పార్టీని మూసివేయించేందుకు అందరూ చేతులు మడతపెట్టి సిద్ధం కావాలని వైఎస్సార్ సీపీ లోక్‌సభ, అసెంబ్లీ అభ్యర్థులు డాక్టర్ పి.అనిల్‌కుమార్‌యాదవ్, డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి కోరారు. హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న నరసరావుపేట నియోజకవర్గ వాసులతో నిజాంపేటలోని కొలను రాఘవరెడ్డి గార్డెన్స్‌లో ఆత్మీయ సమావేశం ఆదివారం నిర్వహించారు. అనిల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ ఈ ఎన్నికలు ఒక చారిత్రాత్మకమైనవి అనే విషయం ప్రతి ఒక్కరూ గుర్తుంచుకొని భాగస్వాములు కావాలని కోరారు. ఈ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ మరోసారి విజయం సాధిస్తే టీడీపీపై చావుదెబ్బ పడుతుందన్నారు. చంద్రబాబు వయస్సు 75ఏళ్లు అని, ఇవే అతని ఆఖరి ఎన్నికలు అన్నారు. ఈసారి ఓడిపోతే వచ్చే ఎన్నికలకు వైఎస్సార్ సీపీకి పోటీనే ఉండదన్నారు. డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ దేశంలో లేని గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను రాష్ట్రంలో తొలిసారిగా సీఎం జగన్ అమలు చేసి చూపించారన్నారు. దీని ద్వారా ప్రతి గ్రామంలో 11 మంది ఉద్యోగులను నియమించి, వలంటీర్ల ద్వారా పరిపాలనను ఇంటివద్దకే తీసుకొచ్చాడన్నారు. వందేళ్ల నాటి భూములకు రీసర్వే చేసి క్రమబద్ధీకరించారని పేర్కొన్నారు. ఇన్ని మంచిపనులు చేసిన సీఎం వైఎస్ జగన్‌కు అన్నీ వర్గాల ప్రజలు మద్దతు పలికి వచ్చే ఎన్నికల్లో విజయం సాధించేందుకు సహకారం అందజేయాలని కోరారు. తొలుత దివంగత వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

అప్రమత్తతతోనే అగ్ని ప్రమాదాల నివారణ

పల్నాడు జిల్లా అగ్నిమాపక అధికారి ఎస్. శ్రీధర్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న శ్రీధర్, కిరణ్‌కుమార్‌రెడ్డి

చిలకలూరిపేట టౌన్: అప్రమత్తతతోనే అగ్ని ప్రమాదాల నివారణ సాధ్యం అవుతుందని పల్నాడు జిల్లా అగ్నిమాపక అధికారి ఎస్.శ్రీధర్ చెప్పారు. అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు ఆయన ఆదివారం హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విపత్తు స్పందన, అగ్నిమాపక సేవల శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఏటా ఏప్రిల్ 14 నుంచి 20వ తేదీ వరకు అవగాహన వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ముఖ్యంగా వంటింట్లో గ్యాస్ లీక్ కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పొరపాటున ప్రమాదం సంభవిస్తే దాన్ని అడ్డుకునే విధానాలపై అవగాహన కల్పించారు. విద్యుత్ కారణంగా వాటిల్లే ప్రమాదాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. అనంతరం ఆయా జాగ్రత్తలపై రూపొందించిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. చిలకలూరిపేట ఫైర్ ఆఫీసర్ కిరణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

అగ్నిమాపక వారోత్సవాల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



నరసరావుపేట: అగ్నిమాపక శాఖ వారోత్సవాల మొదటి రోజైన ఆదివారం జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ కలెక్టరేట్‌లో వాల్‌పోస్టర్, కరపత్రాలను ఆవిష్కరించారు. స్థానిక అగ్నిమాపక కేంద్రంలో జిల్లా విపత్తుల స్పందన, అగ్నిమాపక అధికారి యస్.శ్రీధర్ అగ్ని ప్రమాదాల్లో మృతి చెందిన సిబ్బందికి నివాళులు అర్పించారు. అనంతరం అగ్నిమాపక పరికరాల ప్రదర్శనను ప్రారంభించారు. జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకం, నరసరావుపేట కేంద్రం అధికారి ఎం.వి.సుబ్బారావు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇంజినీరింగ్ విద్యార్థి మృతి



సత్తెనపల్లి: రోడ్డు ప్రమాదంలో ఇంజినీరింగ్ విద్యార్థి మృతి చెందిన సంఘటన ఆదివారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. సత్తెనపల్లి మండలం గుడిపూడి గ్రామానికి చెందిన మల్లాది నరేంద్రబాబు (22) బీటెక్ తృతీయ సంవత్సరం చదువుతున్నాడు. శనివారం రాత్రి ద్విచక్ర వాహనంపై వెళుతుండగా పట్టణంలోని పెద్ద కాలువ సమీపంలో అదుపుతప్పి పడిపోయాడు. దీంతో తీవ్ర గాయాలయ్యాయి. పట్టణంలోని ఏరియా వైద్యశాలలో ప్రాథమిక చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం గుంటూరు తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడు. చేతికొచ్చిన కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు బ్రహ్మానందరావు, జ్యోతి కన్నీరుమున్నీరుగా విలపించారు. పట్టణ ఎస్ఐ ఎం.సత్యనారాయణ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

తెలుగు క్యాలెండర్ ఆవిష్కరణ



గుంటూరు వెస్ట్: ఉగాదిని పురస్కరించుకుని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి, జేసీ రాజకుమారి తెలుగు క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఆదివారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. డీఆర్వో పెద్ది రోజా, సోషల్ వెల్ఫేర్ డీడీ మధుసూదనరావు, కలెక్టరేట్ లీగల్ సెల్ పర్యవేక్షకులు లక్ష్మయ్య, జిల్లా కోఆపరేటివ్ అధికారి వీరాచారి, చేనేత అసిస్టెంట్ డైరెక్టర్ వనజ, శిల్పారామం ఏఓ శ్రీనివాస రెడ్డి, ఎస్‌ఈ కార్పొరేషన్ ఈడీ ప్రేమ కుమారి, అధికారులు పాల్గొన్నారు.

అత్యున్నత రాజ్యాంగాన్ని అందించిన అంబేడ్కర్

- ఎస్పీ బిందుమాధవ్
- జిల్లా పోలీసు కార్యాలయంలో నివాళులు

నరసరావుపేట: ప్రపంచంలోనే అత్యున్నతమైన రాజ్యాంగాన్ని దేశానికి అందించిన మహనీయుడు భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని పల్నాడు జిల్లా ఎస్పీ జి.బిందుమాధవ్ కొనియాడారు. ఆదివారం 133వ జయంతి సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పోలీస్ అధికారులతో కలిసి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులు అర్పించారు. ఎస్పీ మాట్లాడుతూ అంబేడ్కర్ గొప్ప విద్యావేత్త, మహాజ్ఞాని, న్యాయవాది, సంఘ సంస్కర్త అని పేర్కొన్నారు. కుల, మత, ప్రాంతాలకు అతీతంగా రాజ్యాంగ ఫలాలు ప్రతి ఒక్కరికీ అందాలని, ప్రపంచంలోనే అత్యున్నతమైన రాజ్యాంగాన్ని దేశానికి అందించారని తెలిపారు. పేదలు, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి అహర్నిశలు కృషిచేసిన మహనీయులని కొనియాడారు. ప్రతి ఒక్కరూ అంబేడ్కర్‌ను ఆదర్శంగా తీసుకోవాలని ఆయన సూచించారు. అదనపు ఎస్పీ అడ్మిన్ ఆర్. రాఘవేంద్ర, ఏఆర్ అడిషనల్ ఎస్పీ డి. రామచంద్రరాజు, డీఎస్పీ గాంధీరెడ్డి, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి సెల్యూట్ చేస్తున్న ఎస్పీ బిందుమాధవ్

జగనన్న సంక్షేమంతో పార్టీలోకి భారీగా చేరికలు



పార్టీలో చేరిన వారితో మంత్రి రజిని, ఎమ్మెల్యే రోశయ్య తదితరులు

- మంత్రి విడదల రజిని
- జనసేన నుంచి 100 మంది యువకులు వైఎస్సార్ సీపీలో చేరిక

పట్నంబజారు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు అందజేసిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల్ని చూసి ఆకర్షితులై పలువురు పార్టీలో చేరుతున్నారని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు మాదా రాధాకృష్ణమూర్తి నేతృత్వంలో, పఠాన్ ఫయాజ్‌ఖాన్, షేక్ బాషాల ఆధ్వర్యంలో కొబాల్డుపేటకు చెందిన 100 మంది యువకులు జనసేన నుంచి వైఎస్సార్ సీపీలో చేరారు. మంత్రి రజిని, పొన్నూరు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి కిలారి రోశయ్య వారికి కండువాలు కప్పి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి విడదల రజిని మాట్లాడుతూ వైఎస్సార్ సీపీకి మైనారిటీ వర్గాలు పట్టుగొమ్మలని కొనియాడారు. నా ఎస్సీలు..నా ఎస్టీలు.. నా బీసీలు.. నా మైనారిటీలంటూ.. ప్రతి ఒక్కరినీ సొంత మనుషుల్లా భావించే వ్యక్తి సీఎం జగనన్న అని స్పష్టం చేశారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమం అందించి.. తాను మంచి చేస్తేనే ఓటు వేయండి అని అడిగే ధైర్యం సీఎం జగన్‌కు తప్ప మరెవ్వరికీ లేదని తెలిపారు. పొన్నూరు ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి కిలారి రోశయ్య మాట్లాడుతూ సంక్షేమ సారథి సీఎం వైఎస్ జగన్ పరిపాలన విధానాలే రానున్న రోజుల్లో వైఎస్సార్ సీపీని విజయ తీరాలకు చేర్చనున్నాయని తెలిపారు. పార్టీలో చేరిన వారిలో ఇమ్రాన్, మెహబూబ్ బాషా, ఫయాజ్‌ఖాన్, ఖాలీద్, జమీర్, సందాని, జాకీర్, ఇర్ఫాన్, హఫీజ్, సోహేల్, బాబు, రహీమ్‌బాబు, అస్లామ్, షకీర్, సలీంబాబు, బాజి బాషా, అలీఖాన్, బాషా, నసీర్, హుస్సేన్‌ఖాన్, గౌస్, రిజ్వాన్, చరణ్, సాయి, పర్వేజ్, హబీబుల్లా, రియాజ్, గఫార్, ఫయాజ్, అబ్దుల్‌రహీమ్, కరీముల్లా, సునీల్, షాహీద్, షంషేర్, మీరావలి, మౌలాలి, ఆజామ్, షకీల్, ఖాజ, సమీవుల్లా, షఫీ, బాజి, అజయ్, జానీ, సుభాని, కరీం, ఘని ఉన్నారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ బూసి రాజలత పాల్గొన్నారు.

సీఎం జగన్‌పై దాడి దురదృష్టకరం

ఆంధ్రప్రదేశ్ రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షులు నరేష్‌కుమార్



నెహ్రూనగర్: ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డిపై దుండగులు రాయితో దాడి చేయడం దురదృష్టకరమని ఆంధ్రప్రదేశ్ రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి నరేష్‌కుమార్ ఖండించారు. నగరంలోని ఓ హోటల్‌లో ఆదివారం సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. సంఘ నాయకులంతా సీఎం జగన్‌పై దాడిని తీవ్రంగా ఖండించారు. దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అనంతరం పలు డిమాండ్లను తీర్మానించారు. అన్ని రాజకీయ పార్టీలు రెడ్లకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని, రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేసి ప్రతి ఏడాది రెండు వేల కోట్ల రూపాయలు మంజూరు చేయాలని కోరారు. పేద రెడ్డి ఆడ పిల్లల పెళ్లిళ్లకు ప్రభుత్వం ఆర్థి సాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గ, జిల్లా కేంద్రాల్లో రెడ్డి కమ్యూనిటీ హాల్స్ ఏర్పాటు చేయాలని తదితర డిమాండ్లను రాజకీయ పార్టీలకు విన్నవించారు. సంఘ నాయకులు గోపాల్‌రెడ్డి, కె. రామకృష్ణారెడ్డి, భరత్ రెడ్డి, విశ్వనాథరెడ్డి, అరుణకుమారి పాల్గొన్నారు

బాపట్ల జిల్లాలో కట్టుదిట్టంగా నిఘా వ్యవస్థ

బాపట్ల టౌన్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నిఘా వ్యవస్థను పటిష్టపర్చామని జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ తెలిపారు. ఆదివారం జిల్లా వ్యాప్తంగా చేపట్టిన తనిఖీలపై ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రధాన రహదారులు, కూడళ్ల ద్వారా వెళ్తున్న బస్సులు, లారీలు, కార్లు, ఆటోలు, గూడ్స్ వాహనాలు, ద్విచక్ర వాహనాలు, ఇతర వాహనాలను పోలీస్‌లు క్షుణ్ణంగా తనిఖీలు చేస్తున్నారన్నారు. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా సరైన ఆధారాలు చూపించకుండా తరలించే నగదు, ఆభరణాలు, అక్రమ మద్యం, మాదకద్రవ్యాలు, ప్రజలను ప్రలోభాలకు గురి చేయడానికి ఉపయోగించే బహుమతులు, ఇతర వస్తువులను సీజ్ చేస్తున్నామని తెలిపారు. ఎన్నికల నియమావళి అమలులో ఉన్న నేపథ్యంలో ప్రజలు ఇతర ప్రాంతాలకు వెళ్ళేటప్పుడు రూ.50 వేలకు మించి నగదు, ఎక్కువ నగలు తీసుకువెళ్లరాదని ఆయన సూచించారు. ఒకవేళ అవసరాల రీత్యా తీసుకెళ్తే సంబంధిత ఆధారాలు, ధ్రువీకరణ పత్రాలను అధికారులకు చూపించాలన్నారు. ఎన్నికల నియమావళిని అందరూ పాటిస్తూ వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులకు ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.



వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులు

26 నుంచి ఎడ్ల బల ప్రదర్శన పోటీలు



వివరాలు తెలుపుతున్న జయభారత్‌రెడ్డి, సభ్యులు

రెంటచింతల: రెండు తెలుగు రాష్ట్రాల స్థాయిలో ఎడ్ల బల ప్రదర్శన పోటీల్ని ఈ నెల 26నుంచి నిర్వహిస్తున్నట్లు శుభోదయ యువజన సంఘం అధ్యక్షుడు గాదె జయభారత్‌రెడ్డి తెలిపారు. ఆదివారం రెంటచింతలలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం సూర్యపేట మండలం మఠంపల్లిలో 25న జరిగే శుభవార్త దేవాలయ తిరుణాళ్ల సందర్భంగా ఈ నెల 26 నుంచి 29 వరకు అక్కడే ఉన్న మాంట్ ఫోర్ట్ స్కూల్(బ్రదర్స్ స్కూల్)ఆవరణలో ఈ పోటీల్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 26న జరగనున్న నాలుగు పండ్ల విభాగంలో మొదటి బహుమతి రూ.30 వేలు, ద్వితీయ బహుమతి రూ.25 వేలు, తృతీయ బహుమతి రూ.20 వేలు, నాల్గవ బహుమతి రూ.15 వేలు, ఐదవ బహుమతి రూ.10 వేలు, ఆరో బహుమతి రూ.8 వేలు, ఏడో బహుమతి రూ.5 వేలు అందజేయనున్నట్లు తెలిపారు. 27న ఆరుపండ్ల విభాగంలో మొదటి బహుమతి రూ.50 వేలు, ద్వితీయ బహుమతి రూ.40 వేలు, తృతీయ బహుమతి రూ.30 వేలు, నాల్గవ బహుమతి రూ.20 వేలు, ఐదవ బహుమతి రూ.15 వేలు, ఆరో బహుమతి రూ. 12వేలు, ఏడో బహుమతి రూ.10 వేలు అందజేస్తామని పేర్కొన్నారు. 28న కేటగిరి విభాగంలో మొదటి బహుమతి రూ.70 వేలు, ద్వితీయ బహుమతి రూ.50 వేలు, తృతీయ బహుమతి రూ.30 వేలు, నాల్గవ బహుమతి రూ.25 వేలు, ఐదవ బహుమతి రూ.20 వేలు, ఆరో బహుమతి రూ. 15 వేలు, ఏడో బహుమతి రూ.10 వేలు అందజేయనున్నట్లు చెప్పారు. 29న సీనియర్ విభాగంలో మొదటి బహుమతి రూ. 1.50 లక్షలు, ద్వితీయ బహుమతి రూ. 1 లక్ష, తృతీయ బహుమతి రూ. 60 వేలు, నాల్గవ బహుమతి రూ. 40 వేలు, ఐదవ బహుమతి రూ.25 వేలు, ఆరో బహుమతి రూ. 15 వేలు, ఏడో బహుమతి రూ.12 వేలు అందించనున్నట్లు వివరించారు. పోటీల్లో ఆల్గొనాలనే ఆసక్తి కలిగినవారు ఈ నెల 25లోపు పేరు నమోదు చేసుకుని, ఎంట్రీ ఫీజు రూ.1000 చెల్లించాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9618764924, 9989696953, 9346516995 నంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు. సమావేశంలో యువజన సంఘం సభ్యులు గాదె పవన్‌రెడ్డి, తానం బాలరెడ్డి, కందుల కిరణ్ కుమార్‌రెడ్డి, సలిబండ్ల రాజేష్‌రెడ్డి, కొమ్మారెడ్డి రంజిత్‌రెడ్డి, గోపు అఖిల్‌రెడ్డి, గాదె మనీష్‌రెడ్డి పాల్గొన్నారు.

హోరాహోరీగా వాలీబాల్ టోర్నీ

- అంబేడ్కర్ జయంతి సందర్భంగా మూడు రోజులుగా నిర్వహణ
- పలు జిల్లాల నుంచి 25 జట్లు పోటీలకు హాజరు



టోర్నమెంట్‌లో పోటీ పడుతున్న జట్లు

యద్దనపూడి: అంబేడ్కర్ 133వ జయంతిని పురస్కరించుకుని మండలంలోని ఉన్నవలో జిల్లాస్థాయి వాలీబాల్ టోర్నమెంట్ పోటీలు నిర్వహిస్తున్నారు. గ్రామానికి చెందిన అంబేడ్కర్ యువజన సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీలకు ఉమ్మడి గుంటూరు జిల్లాలతో పాటు ప్రకాశం జిల్లాకు చెందిన 25 జట్లు పాల్గొన్నాయి. గ్రామంలోని ఉదయపురి కాలనీలో ఈనెల 11వ తేదీ నుంచి ఈ పోటీలు కొనసాగుతున్నాయి. పగలు ఎండ తీవ్రత అధికంగా ఉన్నందున రాత్రివేళల్లో ఫ్లడ్‌లైట్ల వెలుగుల్లో ఆయా జట్లు హోరాహోరీగా తలపడుతున్నాయి. దీంతో గ్రామస్తులే కాకుండా సమీప ప్రాంతాలకు చెందిన క్రీడాభిమానులు భారీగా తరలివచ్చి ఆసక్తిగా తిలకిస్తూ క్రీడాకారుల్ని ప్రోత్సహిస్తున్నారు. పోటీల్ని ఉన్నవ గ్రామ సర్పంచ్ దంటూ సరళ, రామారావు దంపతులు పర్యవేక్షిస్తున్నారు. యువజన సమాఖ్య సభ్యులు దంటూ శ్రీకాంత్, కొర్నెపాటి ప్రభుదాసు, మద్దు విజయపవన్, మద్దు జాన్‌బెన్నీ, కూరాకుల వర్ధన్‌రావు నిర్వహణ బాధ్యతలు చేపట్టారు.

ప్రజాస్వామ్య వ్యవస్థకు మంచిది కాదు



వెంకటకృష్ణారెడ్డి, మాజీ మంత్రి

నరసరావుపేట: ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహనరెడ్డిపై విజయవాడలో జరిగిన దాడిని మాజీమంత్రి కాసు వెంకటకృష్ణారెడ్డి ఖండించారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇటువంటి దాడు లు ప్రజాస్వామ్య వ్యవస్థకు ఏమాత్రం మంచిది కాదని, ప్రతి ఒక్కరూ ఖండించాలని కోరారు.

దాడి అమానుషం : ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్



ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్

చిలకలూరిపేట: ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డిపై పథకం ప్రకారం టీడీపీ గూండాలు చేసిన దాడి అమానుషమని, దాడికి పాల్పడిన వారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల రీజినల్ కోఆర్డినేటర్, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ కోరారు. పట్టణంలోని ఆయన నివాసంలో ఆదివారం మీడియాతో మాట్లాడారు. సీఎం వైఎస్. జగన్ సిద్ధం సభలకు, బస్సుయాత్రకు లభిస్తున్న అద్భుత ప్రజాదరణ చూసి ఓర్వలేక కుట్రపన్ని పథకం ప్రకారం దాడి చేశారని ఆరోపించారు. ఈ విషయమై ఎన్నికల కమిషన్ కూడా దృష్టి సారించాలని కోరారు. దాడి జరిగితే ఖండించాల్సింది పోయి టీడీపీ నాయకులు స్పందించిన తీరు తీవ్ర ఆక్షేపణీయమని విమర్శించారు. టీడీపీ అనుకూల మీడియాలో ఎదురు దాడికి పాల్పడటం ప్రజాస్వామ్య విలువలకు పాతరవేయడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి చౌకబారు చర్యలను ప్రజలు హర్షించరని, ప్రజా క్షేత్రంలో తగిన రీతిలో గుణపాఠం చెబుతారని పేర్కొన్నారు.

జగనన్నపై దాడి అమానుష చర్య

- నల్ల బ్యాడ్జిలతో పర్చూరు అసెంబ్లీ అభ్యర్థి యడం బాలాజీ నిరసన
- దాడికి బాధ్యులైన వారిని వెంటనే శిక్షించాలని డిమాండ్

పర్చూరు (చినగంజాం): ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డిపై శనివారం రాత్రి విజయవాడలో జరిగిన దాడి అమానుష చర్య అని వైఎస్సార్ సీపీ పర్చూరు అసెంబ్లీ అభ్యర్థి యడం బాలాజీ పేర్కొన్నారు. ఇది ప్రతిపక్షాల అతి హేయమైన చర్యగా ఆయన అభివర్ణించారు. ముఖ్యమంత్రిపై దాడికి నిరసనగా పర్చూరు బొమ్మల సెంటర్‌లో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ప్రతిపక్షాలు చేసిన కుట్రకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రజల్లో సీఎం జగన్‌కు వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక ఆయనపై దాడికి దిగుతున్నారని ప్రతిపక్షాలను ఉద్దేశించి ఆయన ధ్వజమెత్తారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు అండగా ఉంటున్న జగనన్నను కాపాడుకోవాల్సిన సమయం ఆసన్నమైందని ఆయన పిలుపునిచ్చారు. జగన్‌మోహన రెడ్డిని కాపాడుకోలేకపోతే భవిష్యత్ అంధకారం అని హెచ్చరించారు. ఆయనపై చేసిన దాడిని యావత్ ప్రపంచం ఖండిస్తోందన్నారు. దాడికి పాల్పడిన వారిని వెంటనే శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మేకా ఆనందకుమారి, వైస్ ఎంపీపీ కోట ప్రసన్న, సర్పంచ్ మల్లా అంజమ్మ, మాజీ ఎంపీపీ కోట హరిప్రసాద్, పార్టీ మండల అధ్యక్షుడు కఠారి అప్పారావు, మార్టూరు మండల పార్టీ అధ్యక్షుడు పఠాన్ కాలేషావలి, వక్ఫ్‌బోర్డు కార్యదర్శి గడ్డం మస్తాన్‌వలి, నియోజక వర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు మైలా చిననాగేశ్వరరావు, రాష్ట్ర విద్యార్థి విభాగం కార్యదర్శి మాచవరపు రవికుమార్, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు కట్టా రత్నరాజు, నాయకులు తులసి నాగేశ్వరరావు, కోలా శ్రీనివాసరావు, గాజుల రమేష్, దాసరి వెంకట్రావు, ఆకుల హేమంత్, గాదె సురేష్, తులసి నాగమణి, గేరా స్వరాజ్ కుమార్, కూరాకుల ఇస్సాక్, కొటొ ఏట ప్రభుదాసు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎం జగన్‌పై దాడి పిరికిపందల చర్య

నిరసన వ్యక్తం చేసిన చీరాల అసెంబ్లీ అభ్యర్థి వెంకటేష్

చీరాల: జననేత, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహిస్తున్న సిద్ధం సభలు, మేమంతా సిద్ధం బస్సు యాత్ర విజయవంతం కావడంతో ఓర్వలేక దాడి చేయడం పిరికిపందల చర్య అని వైఎస్సార్ సీపీ చీరాల అసెంబ్లీ అభ్యర్థి కరణం వెంకటేష్ పేర్కొన్నారు. సీఎం జగన్‌పై దాడిని నిరసిస్తూ ఆదివారం రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి వెంకటేష్, పార్టీ నాయకులు శాంతియుతంగా మౌన ప్రదర్శన చేపట్టారు. ఈసందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ సీఎం జగన్‌కు వస్తున్న ప్రజాదరణ, ఎన్నికల్లో విజయం వైపు దూసుకెళ్తున్న ఆయనపై దాడి చేయడం అత్యంత దుర్మార్గమైన చర్య అన్నారు. టీడీపీ నాయకులు సీఎంపై దాడి చేయడం తమని కలచివేసిందన్నారు. సిగ్గుమాలిన రాజకీయాలు చేయడంలో సిద్ధహస్తుడైన చంద్రబాబు అండ్ టీం దాడికి ఉసిగొల్పడం హేయమైన చర్య అన్నారు. 40 ఏళ్ల రాజకీయ చరిత్ర, 14 ఏళ్లు సీఎంగా పనిచేసిన చంద్రబాబు కుటిల రాజకీయ కుయుక్తులు జగనన్నపై ప్రయోగించడాన్ని రాష్ట్ర ప్రజలందరూ చూస్తున్నారని తెలిపారు.

ఫ్యాన్ గాలికి కొట్టుకుపోవడం గ్యారెంటీ

మే 13న జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ జోరుకు సైకిల్ పత్తా లేకుండా పోతుందన్నారు. టీడీపీని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని, జననేత జగన్‌మోహన్‌రెడ్డికి పట్టం గట్టేందుకు ఫ్యాన్ గుర్తుపై ఓట్లేసి గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారని వెంకటేష్ అన్నారు. జగనన్నపై దాడి చేసిన దుండగులను త్వరగా పట్టుకుని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మాజీ ఎంపీ చిమటా సాంబు, మున్సిపల్ చైర్మన్ శ్రీనివాసరావు, వైస్‌చైర్మన్ జైసన్‌బాబు, మున్సిపల్ కౌన్సిలర్లు మల్లెల లలిత, కంపా అరుణ్, ఎబినేజర్, అనీల్, వివిధ హోదాల్లోని నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దుశ్చర్యలు మానుకోకపోతే పుట్టగతులుండవు

- వైఎస్సార్ సీపీ అద్దంకి ఎమ్మెల్యే అభ్యర్థి పానెం చిన హనిమిరెడ్డి
- అద్దంకి – నార్కెట్‌పల్లి రహదారిపై నిరసన ర్యాలీ

అద్దంకి రూరల్: దుశ్చర్యలు మానుకోకపోతే తెలుగుదేశం పార్టీకి పుట్టగతులుండవని వైఎస్సార్ సీపీ అద్దంకి అసెంబ్లీ అభ్యర్థి పానెం చిన హనిమిరెడ్డి అన్నారు. శనివారం విజయవాడలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిపై జరిగిన దాడిని ఖండిస్తూ ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయం ఎదుట అద్దంకి-నార్కెట్‌పల్లి నామ్ రహదారిపై నిరసన కార్యక్రమం, ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా చిన హనిమిరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రతిపక్షాలు ఏకమై సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని అంతమొందించటానికి కుట్రలు పన్నుతున్నారన్నారు. దానిలో భాగంగానే ఇలాంటి దాడులకు ఒడిగడుతున్నారన్నారు. బస్సుయాత్రలకు, సిద్ధం సభలకు వస్తున్న ప్రజాదరణ చూసి రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ఓటమి చెందుతామని చంద్రబాబు భయపడిపోయారన్నారు. కాబట్టే నీచ రాజకీయాలకు, దాడులకు పాల్పడుతున్నారన్నారు. ఓటమి భయంతో ఏం చేస్తున్నాడో తెలియని ఉన్మాదంలో చంద్రబాబు ఉన్నాడన్నారు. ప్రజలంతా జగన్‌మోహన్ రెడ్డి వైపే ఉన్నారన్నారు. తెలుగుదేశం పార్టీ వారే ఛీకొట్టే విధంగా చంద్రబాబు నాయుడు ప్రవర్తిస్తున్నారన్నారు. నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు మారం వెంకారెడ్డి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు జ్యోతి హనమంతరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ పద్మేష్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ప్రాణాలమీదకు తెచ్చిన శీతల పానీయాలు

బల్లికురవ: వేసవి తాపం తీర్చుకునేందుకు ఇంటి ముందుకు అమ్మకానికి వచ్చిన శీతల పానీయాలు తాగి పదిమంది చిన్నారులు అస్వస్థతకు గురయ్యారు. శనివారం ఈ ఘటన జరగ్గా.. విషయం ఆదివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే బాపట్ల జిల్లా బల్లికురవ మండలంలోని నక్కబొక్కలపాడు గ్రామం, బీసీ, ఎస్సీ, కాలనీలో శనివారం విద్యార్థులు శనివారం మధ్యాహ్నం ఇంటి ముందు అమ్మకానికి వచ్చిన బండి దగ్గర లస్సీ, లెమన్, ఆరెంజ్, బాదంపాలు తాగారు. తాగిన గంటసేపటికే స్పృహతప్పి పడిపోయారు. ఆందోళనకు గురైన తల్లిదండ్రులు హుటాహుటిన బిడ్డలను తీసుకుని చిలకలూరిపేట, గుంటూరుల్లోని ప్రైవేటు ఆస్పత్రులకు చికిత్సకు తీసుకెళ్లారు. వైద్యులు ఐసీయూలో ఉంచి చికిత్స అందిస్తున్నారు. చికిత్స పొందుతున్న వారిలో గాలి నిత్య, దీక్షిత్‌బాబు, జంధ్రాజుపల్లి గ్లోరియా, నిడమానూరు వెంకటసాయి, గోరికపూడి జెస్సీ, గెల్లా అక్షర, సహస్ర, గౌతమ్, అలిపినేని ధనుష్, గెల్లా రాహుల్ ఉన్నారు.



పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పుతున్న కావటి మనోహర్‌నాయుడు

టీడీపీకి గుడ్‌బై

పట్టణంలోని 13వార్డు శ్రీనివాసనగర్‌కు చెందిన 30 కుటుంబాలు శనివారం టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరాయి. చిలకలూరిపేట ఎమ్మెల్యే అభ్యర్థి కావటి మనోహర్‌నాయుడు వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో అన్నపరెడ్డి శ్రీనివాసరావు, జంగం దాసు, మంచాల కిరణ్‌కుమార్, బాబూరావు, సురేష్ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ షేక్ మీరాబీ, పార్టీ పట్టణ అధ్యక్షుడు పఠాన్ తలహాఖాన్ పాల్గొన్నారు.

– చిలకలూరిపేట